

గెస్ట్ ఫ్యాకల్టీల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఉన్న పళంగా తొలగించడం సరికాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. గురువారం డిఇఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఎనిమిది సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారిని ఉన్న పళంగా తీసివేస్తే ఎలా అని ప్రశ్నించారు. పాత వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. తక్షణం కొత్త నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి.బాదుల్లా, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, నగర కార్యదర్శి శివ, నాయకులు అరుణ్ పాల్గొన్నారు.

ట్రూ'అప్' షాక్..!

యూనిట్‌కు 83 పైసలు పెంపు
జిల్లాపై రూ.2.5 కోట్ల భారం
ఏప్రిల్ నుంచి పెంపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

"ఈయన పేరు సయ్యద్ హుస్సేన్, కడప నగరంలోని బెల్లంమండి వీధిలో నివాసం ఉంటున్నారు. రెండు నెలల కిందట ఇంటికి కరెంటు బిల్లు రూ.600 వచ్చేది. ప్రభుత్వం ట్రూఅప్ పేరిట వడ్డించిన వడ్డింపుల నేపథ్యంలో మేలో రూ.1251 బిల్లు వచ్చింది. ఇంత మొత్తంలో బిల్లు రావడానికి గల కారణాలు తెలుసుకోవడానికి విచారణ కేంద్రాన్ని సంప్రదించగా సర్వర్ పనిచేయడం లేదని, ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేయాలని బిల్ కలెక్టర్లు చెప్పడంతో నోరెళ్లబెట్టాల్సి వచ్చింది."

జిల్లా ప్రజలకు ట్రూఅప్ షాక్ తగిలింది. ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కరెంటు ఛార్జీలను భారీగా పెంచేసింది. యూనిట్‌కు సగటున మూడు దశలుగా 83 పైసల చొప్పున పెంచి, 36 నెలలు వసూలు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాపై రూ.2.5 కోట్ల మేర భారం పడింది. జిల్లాలోని నివాసగృహాలు మొదలుకుని వ్యవసాయ, కమర్షియల్, ఇండస్ట్రియల్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ సర్వీసుల వరకు విద్యుత్ కనెక్షన్లన్నింటికీ కరెంటు ఛార్జీలను పెంచింది. ప్రభుత్వం పేద, ధనిక తారతమ్యాన్ని పాటించకుండా ట్రూఅప్ ఛార్జీలను బాదేయడం విస్మయాన్ని కలిగిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 12,72,0,64 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 9,46,166 లక్షల గృహాల విద్యుత్ కనెక్షన్లు, 1,04,208 వాణిజ్య కనెక్షన్లు, 7,522 పరిశ్రమల కనెక్షన్లు, 30,729 లక్షల ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాల సర్వీసులు, 1.83,439 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో హెచ్‌విడిఎస్ 267 సబ్ స్టేషన్ల పరిధిలో ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లను విభజించారు. వీటిన్నింటి పరిధిలోని కనెక్షన్లన్నింటికీ ట్రూఅప్ ఛార్జీల పెంపును వర్తింపజేసింది. ఫలితంగా ప్రభుత్వానికి పేద, ధనికలనే తేడాలు లేకుండా ధనికులపై ప్రేమను ఒలకబోయడం తాను ధనికుల పక్షపాతిని అనే ముద్రను స్థిరం చేసుకుందనే విమర్శను సుస్థిరం చేసుకుందని చెప్పవచ్చు.

2014 నాటి భారం షురూ!

2014 నుంచి 2019 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూఅప్ ఛార్జీలను పెంచేసింది. 2022 ఆగస్టు నుంచి 2025 జులై వరకు యూనిట్‌కు రూ.83 పైసలు చొప్పున పెంచేసింది. 2025 జులై వరకు ప్రతి నెలా ట్రూఅప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. 2023 మార్చిలో 10.96, మేలో 13.57 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. మే నెలకు ట్రాన్స్‌కో ఆదాయం రూ.90.12 కోట్ల ఆదాయం లభించాల్సి ఉంది. 2023 ఏప్రిల్‌లో 11 లక్షల, మే 13.57 లక్షల యూనిట్లు వినియోగం కావడం గమనార్హం. జిల్లాపై సుమారు రూ.2.5 కోట్లకు పైగా భారం పడనుంది. నెలకు రూ.90.12 కోట్ల మేర ఆదాయం సమ కూరనుంది.

పేదలను కొట్టి..

ట్రూఅప్ ఛార్జీలు సామాన్యులను సమిదలుగా మార్చాయనే వాదన వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా బిపిఎల్ కేటగిరీ కింద ఎనిమిది లక్షల కుటుంబాల వరకు ఉన్న సంగతి తెలిసిందే. పేదల ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి సామాన్యులను ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించలేదు. ట్రూఅప్ ఛార్జీల పెంపు విషయంలో జిల్లాలోని 85 వేల కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు, 4,211 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ల మీద ట్రూ అప్ ఛార్జీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం సముచితం. ఇటువంటి ఆలోచన చేయకుండా సామాన్య విద్యుత్ వినియోగదారుల మీద ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వేయడం పట్ల సర్వత్రా విమర్శల వర్షం కురుస్తోంది.

గత పెంపుదలకు భిన్నంగా

గత కరెంటు ఛార్జీల పెంపునకు భిన్నంగా ఛార్జీలను పెంచింది. గతంలో కరెంటు ఛార్జీల పెంపుదలను పరిశీలిస్తే శ్లాబ్ రేట్ల ప్రకారం పెంచేయడం తెలిసిందే. దీన్నిబట్టి గమనిస్తే పేదల విద్యుత్ వినియోగం పరిమితం. దీన్నిబట్టి పేదలపై భారం పరిమితంగానే ఉండేది. తాజా ట్రూ అప్ ఛార్జీల విషయంలో పేద, ధనిక కనెక్షన్లనే తార తమ్యం లేకుండా ఛార్జీల పెంపు అనివార్యమైంది. జిల్లాలోని కమర్షియల్, విద్యుత్ కనెక్షన్లపై ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేయడానికి బదులుగా కరెంటు కనెక్ష న్లన్నింటికీ ఛార్జీలను పెంచడంపై విమర్శల వర్షం కురుస్తోంది. టెలిస్కోపిక్ వినియోగదారులకు వాత పెట్టనుందని అర్థమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో దళిత కాలనీల్లో ఒక బల్బును ఉప యోగించుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం వైఎస్ఆర్ ఎస్‌సిలకు ప్రవేశపెట్టిన ఒక బల్బు ఉచిత విద్యుత్ వినియోగ పథకానికి కాలనీల పరిమితం పేరుతో తిలోదకాల్చింది. ఫలితంగా లక్ష మందికిపైగా ఒక బల్బు లబ్ధిదారులు నష్టపోవడం తెలిసిందే.

మరో విద్యుత్ ఉద్యమానికి సమాయత్తం

- సంతకాల సేకరణలో అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి-కడప అర్బన్

జగన్, మోడీ పాలనలో సర్వం బాదుడేనని, అభివద్ధిని విస్మరించి, ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ల సేవలో పాలకులు తరిస్తున్నారని అఖిలపక్ష నేతలు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ గురువారం బాలికల కళాశాల వద్దనున్న విద్యుత్ సబ్ స్టేషన్ బిల్లులు చెల్లింపు కేంద్రం వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు అలీఖాన్, టిడిపి నాయకులు జలతోటి జయకుమార్, బిసి మహాసభ నేత అవ్వారు మల్లికార్జున, బిఎస్‌పి నేత గుర్రప్ప, ఎన్ఆర్‌సి జెఎసి నేత బాబు బాయ్, పుర ప్రముఖులు జానుమద్ది విజయభాస్కర్, జెవి రమణ, వామపక్ష నాయకులు డబ్ల్యూ. రాము, రమణయ్య, లోక్ సత్తా శ్రీకష్ణ, ఆప్ నేత శ్రీనివాసులు, ఎస్‌డిపిఐ నాయకులు జాహీర్, సిహెచ్ఆర్‌డి శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. వినియోగించిన విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్స్, కస్టమర్, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరిట రాష్ట్ర ప్రభుత్వం అధిక వసూళ్లకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ బాదుడును నిరసిస్తూ ఈనెల 30వ తేదీన విద్యుత్ భవన్ వద్ద జరిగే ఆందోళనలో పెద్ద ఎత్తున ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు కష్ణమూర్తి, నాగసుబ్బారెడ్డి, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, నగర సహాయ కార్యదర్శిలు కె.సి.బాదుల్లా, మద్దిలేటి, వివిధ ప్రజా సంఘాల నాయకులు టక్కోలి మనోహర్‌రెడ్డి, గంగా సురేష్, ఆర్.బాబు, బ్రహ్మం, దస్తగిరి, భాగ్యలక్ష్మి, వెంకట్ రాముడు, నాగేశ్వరరావు, సిఆర్‌వి ప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, మురళి, ఫరూక్, మాసా కోదండరాం, సుబ్బరాయుడు, నారాయణ, శివ నాగేంద్ర, మైనుద్దీన్, పుల్లయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో వామపక్ష, అఖిలపక్ష నాయకులు

సైన్స్ అవార్డుల రద్దు

శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమే

జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

సైన్స్ అవార్డులను రద్దు చేయడం శాస్త్ర పురోగతికి, దేశాభివృద్ధికి అడ్డుకట్ట వేయడమేనని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అన్నారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. గురువారం జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన అధ్యక్షులు బాలబయన్న, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ యువ శాస్త్ర వేత్తలకు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను వారు తమ రంగాలలో చేసిన కషికి కనీస గుర్తింపు ఇవ్వడం, ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. వాటిని రద్దు చేయడం ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకుని తాము చెప్పినట్లు వినే కీలుబొమ్మని చేయాలనేదే కేంద్ర ప్రభుత్వం ఆలోచనని విమర్శించారు. బడ్జెట్లో శాస్త్ర సాంకేతిక రంగాలకు నిధుల కోత మనం చూస్తూనే ఉన్నామని తెలిపారు. ఇప్పటికే భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్ ప్రసార్ సంస్థను భారత ప్రభుత్వం మూసేయాలనే నిర్ణయం తీసుకుందని చెప్పారు. మరి ఇలాంటి చర్యలు పాలకులు తీసుకుంటూ దేశం ప్రగతి పథంలో నడుస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపరచకూడదనే భావన పాలకులలో రావడం దుర్మార్గమన్నారు. మరోవైపు అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు మొదలగు అంశాలను పాఠ్యాంశాలలో చొప్పించడం తిరోగమన చర్యకు నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు క్రమబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా శాస్త్రీయతను దూరంచేసి వాటిస్థానంలో తమ భావాజాల, సైద్ధాంతికను అందించాలనే విషవిద్వేష రాజకీయ ఆలోచనలో భాగంగానే సైన్స్ అవార్డుల రద్దని విమర్శించారు. ఈ విషయం ప్రజలు గుర్తించాలని కోరారు. ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు ఖండించాలని జనవిజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తుందన్నారు.

చీటీల పేరుతో మోసగించిన ఓబులేసు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బద్వేలు

మాట్లాడుతున్న డిఎస్‌పి వంశీధర్ గౌడ్

చీటీల పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన ఓబులేసును అరెస్టు చేసినట్లు మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలం చుట్టుపక్కల గ్రామాల ప్రజల వద్ద నమ్మకంగా ఉంటూ 15 చీటీలు వేసి, ఆ డబ్బును విలాసాలకు వాడుకుని ప్రజలకు మోసం చేశాడన్నారు. పోరుమామిళ్ల పట్టణం, రెడ్డినగర్‌లో రూ.1.50 కోట్లతో మూడు అంతస్తుల భవనం నిర్మించాడని, 6 సెంట్లు స్థలం కొనుగోలు చేశాడని, 9 సెంట్ల స్థలంలో 2 ఇండ్లను కట్టించి అమ్మాడని పేర్కొన్నారు. ఇతని వద్ద నుంచి సుమారు రూ.30 లక్షలు విలువగల ఇన్నోవా కృష్టా కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు డబ్బులు ఇచ్చినవారు 82 మంది ఫిర్యాదు చేయగా చేయగా వాటి విలువ రూ.4.47 కోట్లు అప్పుగా తేలినట్లు పేర్కొన్నారు. రంగసముద్రం పరిధిలో ఓబులేసుకు ఉన్న ఇల్లు, స్థలాలను అటాచ్ చేస్తున్నట్లు చెప్పారు. ఓబులేసుకు, ఇతని బినామీలకు స్థలాలు, ఇల్లు వివరాల కోసం బద్వేల్ సబ్ రిజిస్టర్ ఆఫీస్, పోరుమామిళ్ల, కాశినాయన తహాశీల్దార్ కార్యాలయాల నుంచి సమాచారం సేకరిస్తున్నామన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టప్రకారం కోర్టు ద్వారా ఆస్తులను జప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని, అనధికారకంగా చీటీలు నడిపే వారి వద్ద చీటీలు వేసి మోసపోవద్దని సూచించారు. ఈ కేసు విచారణలో ప్రముఖ పాత్రవహించిన పోరుమామిళ్ల సిఐ సురేష్ బాబు, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, కాశినాయన ఎస్ఐ హరిప్రసాద్, కేసులో పాల్గొన్న ఇతర పోలీసు సిబ్బందిని అభినందించారు.

సిడిపిఒను సస్పెండ్ చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు, కార్యకర్తలు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను వేధిస్తున్న కడప సిడిపిఒ సునందను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017, 18 ఏడాదిలో పదవీ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ ఇవ్వాలని స్పందనలో ఐసిడిఎస్ పిడి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. దీనిపై కక్షపెంచుకుని కార్యకర్తలు, ఆయాలను వేధించడం సరికాదని చెప్పారు. ఉదయం 8.40 గంటలకే కేంద్రం వద్ద ఉండాలని, 9 గంటలకే పిల్లలు ఉండాలంటూ తనిఖీలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్హులైన వారికి పదోన్నతు ఇవ్వకుండా, టిఎ, డిఎలు, గ్యాస్ బిల్లులు, సెంటర్ల అద్దెలు, జీతాలు ఇవ్వకుండా పనులు మాత్రం చేయాలనడం సరికాదని చెప్పారు. యాప్‌ల పేరుతో వేధిస్తున్నారని తెలిపారు. రేషన్ షాపుల నుంచి స్టాక్ సెంటర్లకు చేర్చాల్సి ఉన్నా చేర్చడం లేదని పేర్కొన్నారు. బదిలీలు చేయమంటే ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. కార్యకర్తలు, ఆయాలకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ, ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మిదేవి, నాయకులు అంజనీదేవి, వినీల, మెర్సీ, దీప, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యా విధానంలో వినూత్న మార్పులు : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ అవసరాలను తీర్చేలా విద్య ఉండాలన్న సంకల్పంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులతో సింగిల్ మేజర్ నాలుగేళ్ల డిగ్రీ (అనర్స్) విధానం అమల్లోకి తెస్తున్నామని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. గురువారం వైవీయూలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూను గొప్ప విద్యాసంస్థగా తీర్చిదిద్దాలన్న నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం విసి బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. న్యాక్ ఎ ప్లస్ గ్రేడులో నిలబెట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. యూజిసి బ్యాచిలర్ డిగ్రీ కోసం పాఠ్యాంశాలు, క్రెడిట్ రూపకల్పన డిసెంబర్ 2022లో చేసిందన్నారు. విద్యార్థులు ఇష్టమైన సబ్జెక్ట్ తీసుకుని పూర్తి స్థాయిలో లోతైన అవగాహన పొందేలా డిగ్రీ చదువు రూపొందించామన్నారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా ప్రపంచంలో భారతదేశం గొప్ప మానవ వనరులను అందించే దేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అకడమిక్ ఎఫైర్స్ డీన్ దాము, సిడిసి డీన్ సుబ్బరాయుడు కోర్సు వివరాలను తెలిపారు. సమావేశంలో వైవీయూ పిఆర్ఒ డాక్టర్ ఎస్.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విసి సుధాకర్

చెరువులో వ్యర్థాలు వేస్తే చర్యలు

ప్రజాశక్తి-బద్వేలు

ప్రతిపౌరుడు తన వంతు బాధ్యతగా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆహ్లాద వాతావరణంతో పాటు ఎటువంటి ఆనారోగ్య సమస్యలు ఉండవని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని నాగుల చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులలో గాని, రహదారులపై గాని వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని నాగులచెరువులో పట్టణంలోని వ్యర్థాలను అక్కడ వేయడంవలన అతి భయంకరమైన దుర్వాసన వస్తుందని, మినీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందన్నారు. ఇకపై ఆ ప్రాంతంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, వ్యర్థాలను వేసిన వారిపై భారీ జరిమానా వేసి పరిశుభ్రంగా ఉండడానికి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని కోరారు. కార్యక్రమంలో 2వ వార్డ్ కౌన్సిలర్ లక్ష్మీదేవి, వైసిపి నాయకులు పుత్తా శ్రీరాములు, మున్సిపల్ శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

డిఎస్‌సి-98 అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి-కడప అర్బన్

సీనియారిటీ ప్రకారం ఉద్యోగాలు కల్పించకుండా అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ డిఎస్‌సి-98 అభ్యర్థులు డిఇఒ కార్యాలయం ఎదుట రోడ్డు దిగ్బంధనం చేశారు. డిఎస్‌సి-2008 అభ్యర్థులకు ముందుగా ఉద్యోగాలు ఇవ్వడంపై డిఎస్‌సి-98 అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ వెంటనే వాయిదా వేయాలంటూ డిమాండ్ చేశారు. అధికారుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం-1లోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు 8 రకాల విత్తనాలు రూ.10 వేలు విలువ చేసే వ్యవసాయ కిట్లు, విత్తనాలు ఉచితంగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. రూ.10 వేలు తిరిగి కట్టవలసిన పనిలేదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ మంచి అవకాశాన్ని ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎం కుముదా పాల్గొన్నారు.

25న జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

కడప: ఈ నెల 25వ తేదీన కడపలోని ఎసిఎ స్టేడియంలో అండర్-14, అండర్-16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, డిసిఒ ఎస్.కాజామైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి కలిగి ఎంపికల్లో పాల్గొనదలచిన క్రికెట్ క్రీడాకారులు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్ రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు ఒక ఫోటో తీసుకురావాలనిన్నారు. జిరాక్స్ కాపీలతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా తమ వెంట తీసుకుని ఎంపికలకు హాజరుకావాలని తెలిపారు. అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 01-09-2009 తరువాత జన్మించి ఉండాలన్నారు. అండర్-16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొన గలచిన క్రీడాకారులు 01- 09-2007 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఎవరికి కావాల్సిన క్రికెట్ క్రికెట్ కిట్స్‌ను తెచ్చుకోవాలని తెలిపారు.

24న కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న బండి జకరయ్య

కడప: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఈనెల 24న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ తెలిపారు. గురువారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఎఐసిసి సెక్రటరీ సిడి మయప్పన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ నియోజకవర్గాల వారీగా రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో బండి రత్నం పాల్గొన్నారు.

డిగ్రీలో సింగిల్, మేజర్ సబ్జెక్ట్ విధానం రద్దు చేయాలి

- నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిగ్రీలో సింగిల్ సబ్జెక్ట్, మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలని, త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని, స్కూల్ ఇంటర్మీడియట్ ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భక్తి చేయాలని, పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, నగర అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభించి 20 రోజులు పూర్తవుతున్న నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అధ్యాపక, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో అధ్యాపకులు లేక, పాఠ్య పుస్తకాలు ఇవ్వక 23 శాతం ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. దీనిని ప్రభుత్వం గుణపాఠం తీసుకుని ఈ విద్యా సంవత్సరంలో సమస్యలు పరిష్కారించాలని కోరారు. ప్రభుత్వం చేయకుండా పరోక్షంగా ప్రైవేట్ కళాశాలలో చేరే విధంగా ప్రభుత్వ విధానాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో నూతన మార్కులు తీసుకురావడం మంచి పరిణామం, కానీ ఈ మార్పులు పేద విద్యార్థులకి చదువుకుని విధంగా ఉండాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో డిగ్రీలో సింగల్ మేజర్, మైనర్ విధానం తీసుకువచ్చి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థులకు తనకు ఇష్టమైన కోర్స్ ని చదువుకునే హక్కు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కావున ఈ విధానాన్ని రద్దు చేసి త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో ఇప్పటికే పేద, బడుగు, బలహీన వర్గాలు ఉన్నత చదువు చదువుకోవాలని ఆసక్తి చూపిస్తున్న తరుణంలో ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో కొత్త కోర్సులు ఏర్పాటు చేయవలసింది పోయి ఉన్న కోర్సులు ఎత్తివేసి ప్రభుత్వ ఖజానా తగ్గించుకోవడమే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. ఈ విధానం అమలు చేస్తే భవిష్యత్తులో పేదవాడు ఉన్నత చదువుకి దూరం అవుతారని పేర్కొన్నారు. కావున తక్షణమే డిగ్రీలో ఈ విధానాలు ఆపాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలంలో ఉద్రిక్తత

ఆత్మహత్యకు యత్నించిన మహిళలు, యువకుడు

ప్రజాశక్తి-ముద్దనూరు

మహిళల ఆత్మహత్యయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

మండలంలోని పెద్దదుద్యాలలో శ్రీవరద రాజస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములకు గురువారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో నిర్వహించిన బహిరంగ వేలంలో ఉద్రిక్తత నెలకొంది. ఆలయానికి సంబంధించి ముద్దనూరు, తొండూరు, సింహాద్రిపురం, ప్రొద్దుటూరు మండలాల్లో ఉన్న 172 ఎకరాల భూములను మూడేళ్లు కౌలుకు ఇచ్చేందుకు దేవాదాయ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వందేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను వేలం వేయవద్దని గ్రామస్తుల అభ్యంతరం తెలిపారు. ఒక వర్గం వేలం నిర్వహిం చాలని మరో వర్గం వేలం నిర్వహించకూడదని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వేలం అడ్డుకునేందుకు యువకుడు పెట్రోల్ తాగి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరు మహిళలు పోలీసుల ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. టిడిపికి మద్దతు తెలుపినందుకు కక్ష్య సాధింపుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రోద్భలంతో వేలం నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపణ చేశారు. పోలీసుల భారీ బందోబస్తు మధ్య వేలం పాట కొనసాగించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతాంగ సమస్యలపై ఈ నెల 30న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. గురువారం మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నామని చెప్పారు. రాయలసీమ వెనుకబడిన జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్‌హైవేలో భూములు పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా విడుదల చేయాలని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలు నుంచి 0 వడ్డీ, పావలా వడ్డీ పథకాలకు నిధులు విడుదల చేయాలని తెలిపారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయినాయని 0 వడ్డీ పథకం 2 లక్షలకు, పావలా వడ్డీ పథకం ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కనీసం పెట్టుబడులు కూడా చాలడం లేదని తెలిపారు. ప్రభుత్వం కేంద్రం ధరలపై అదనంగా 20 శాతం బోనస్ గా ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే పద్ధతిని నిలుపుదల చేయాలని ఉచిత విద్యుత్తును యథావిధిగా కొనసాగించాలని చెప్పారు. జిల్లాలో కౌలు రైతులందరికి గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాలకష్ణయ్య, నాయకులు చిన్న సిద్ధయ్య, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామసముద్రంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - బి.కోడూరు

బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినీత్‌కుమార్ రాజుల రామసముద్రం సచివాలయం వద్ద గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. జబ్బు ఇంటికి వెళ్లి వారికి వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ జయంతి, హెల్త్ అసిస్టెంట్ (అబ్సర్‌వర్)రామతీర్థం, సచివాలయ ఎఎన్ఎం రేష్మా, కంప్యూటర్ ఆపరేటర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు లక్ష్మిదేవి, మస్తానమ్మ, రామసముద్రం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - బి కోడూరు

తమకు 'ఉపాధి' కూలి చెల్లించాలని మండలంలోని మున్నెళ్లి గ్రామపంచాయతీలో కూలీలు కోరుతున్నారు. నాలుగు వారాల నుండి కూలి డబ్బులు జమ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన ఎండల్లో పని చేశామని, నాలుగు వారాల నుంచి డబ్బు జమ కాలేదని వాపోతున్నారు. సిబ్బందిని అడిగితే మస్టర్ వివరాలు ప్రభుత్వానికి పంపామని, డబ్బులు జమ అయ్యేది తమ చేతుల్లో లేదని అంటున్నారని తెలిపారు. డబ్బులేక కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలి జమ చేయించాలని వారు కోరుతున్నారు.

1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జులై 1వ తేదీనుంచి జగనన్న సురక్ష శిబిరాలను ఆయా గ్రామాల సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శివారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ శిబిరాల ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా పొందవచ్చునన్నారు. జూలై 1న మారేళ్లమడక, 3న మహాదేవపల్లె, 5న నెరసుపల్లె. 7న కల్లూరుపల్లె, 10న కె.ఎర్రగుడి, 12న కుప్పం, 14న చిలేకాంపల్లె, 18న సురభి-1, 20న సురభి-2, 22న కుమారకాలువ, 25న చక్రాయపేట గ్రామ సచివాలయాల్లో శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటి వద్దకు వచ్చే వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ కోరారు.

30లోగా ఇకెవైసి నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

అర్హులైన రైతులు ఈనెల 30లోగా ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఆధార్ అనుసంధాన ఒటిపి బయోమెట్రిక్ విధానంతోపాటు ముఖ గుర్తింపు యాప్ ద్వారా కూడా సులువుగా ఇకెవైసి చేయించుకోవచ్చని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో విఎఎల ద్వారా చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు.

ప్రతి సంఘానికి విజన్ ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి సంఘానికి ఒక విజన్ ఉండాలని డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ సూచించారు. స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయంలో గురువారం బిల్డింగ్ శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని కోరారు. ప్రతి డ్వాక్రా మహిళ సుస్థిర జీవనోపాధి కలిగి ఉండాలన్నారు. పాడి పరిశ్రమ వైపు దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వం ద్వారా జగనన్న పాల వెల్లువలో భాగంగా గ్రామాల్లో పాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఐబి డిపిఎం హరిప్రసాద్‌రాజు, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ శైలజ, వెంకటేశ్వర రావు, ఎంపిఎంలు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలను కొనసాగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీలను కొనసాగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో గురువారం శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగుకు కలెక్టర్ వచ్చిన సందర్భంగా వినతిపత్రం ఇవ్వడానికి వెళితే అక్కడి అధికారులు స్పందించలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కస్తూర్బా పాఠశాలలో 2022-23 ఏడాదికిగానూ నోటిఫికేషన్ ద్వారా నియమితులైన వారిని ప్రభుత్వం తొలగించరాదన్నారు. పదేళ్లపైబడి కొనసాగుతున్న వారిని తీసేసి మళ్లీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడం ఏ నిబంధనో విద్యాశాఖ అధికారులు బహిర్గతం చేయాలన్నారు. కార్యక్రమంలో హాజీ, ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివ

స్థానిక పార్నపల్లి రోడ్డులోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివ అనే వ్యక్తిపై గురువారం లక్ష్మయ్య అనే వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివ అనే వ్యక్తి ఇంటి వద్దకు లక్ష్మయ్యకు చెందిన మేకలు రావడంతో.. లక్ష్మయ్యను మందలించాడు. దీంతో మాటమాట పెరిగి లక్ష్మయ్య తనవద్దనున్న కొడవలితో శివపై దాడికి దిగాడు. ఈ దాడిలో శివ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు, స్థానికులు శివను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శివను కడప రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని బైపాస్ సర్కిల్ సమీపంలో అలీ పాలకోవా సెంటర్ వద్ద ఫ్లైయాష్ ట్యాంకర్ అతివేగంగా దూసుకొచ్చిన సంఘటన గురువారం ఉదయం 7గంటలకు చోటుచేసుకుంది. అలీ పాలకోవా సెంటర్ యజమాని షేక్ మహబూబ్ బాషా వివరాలు మేరకు.. ఫ్లైయాష్ ట్యాంకర్ (ఎపి04 యుబి 2742) అతివేగంగా దుకాణంలోకి దూసుకొచ్చిందన్నారు. ఈ ప్రమాదంలో తన కుమారుడు షేక్ అబ్దుల్ కరీంకు పెను ప్రమాదం తప్పిందన్నారు. ట్యాంకర్ అతివేగంగా దూసుకొస్తున్న విషయాన్ని తన కుమారుడు గ్రహించి తప్పించుకున్నాడని తెలిపారు. బుధవారం రాత్రి జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో అధిక వర్షం పడడంతో ట్యాంకర్ వాహనం బురదలో ఇరుక్కుపోయి ముందుకు కదల్లేకపోవడంతో దుకాణంలో ఉన్న ఏడుగురి ప్రాణాలు మిగిలాయన్నారు. ఈ ప్రమాదంలో ఒక ఇన్నోవా కార్ (ఎపి 27బిఎస్ 9996), స్కూటీ (ఎపి 39 క్యూబి 6544) వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. సంఘటనపై జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

దుకాణంలోకి దూసుకొచ్చిన ట్యాంకర్, దెబ్బతిన్న ఇన్నోవా కారు

నిరుపయోగం.. పాలశీతలీకరణ కేంద్రం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పరిసర ప్రాంతాల పాడి రైతులకు తోడ్పాటునందించేందుకు గత పాలకులు జమ్మలమడుగులో పాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై ఆధారపడి పాడి రైతులు తమ జీవనాన్ని కొనసాగించేవారు. కాలక్రమేణా ఆ కేంద్రం మూతపడింది. ఈ నేపథ్యంలో పాడి రైతులు ప్రయివేట్ డెయిరీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని 2019 జనవరి 9న మాజీ మంత్రి దేవగుడి ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.30 లక్షలతో 5 వేల లీటర్ల సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల చాలా గ్రామాల పాడి రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి ఎక్కువగా ఉన్నారు. జీవనోపాధికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. పాడి రైతుల జీవనోపాధి కోసం పాలకులు స్పందించి మూత పడిన ఈ పాలశీతలీకరణ కేంద్రాన్ని మళ్లీ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం

పోలీసులు ఏంచేస్తున్నారు? : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులు ఏం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎస్.వరదరాజులరెడ్డి ఆశాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజుపాలెం మండలం గాదె గూడూరు గ్రామంలో ఓ వృద్ధురాలి హత్య కేసు విచారణలో భాగంగా కొంతమంది కాని స్టేబుళ్లు ఓబులేసు అనే వ్యక్తిపై విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. గాయ పడిన ఓబులేసును పోలీసులే తీసుకొచ్చి హాస్పిటల్లో చేర్పించారన్నారు. అమాయకుడ్ని పట్టుకుని తప్పు ఒప్పుకుని కొట్టడం పోలీసుల దుశ్చర్యకు నిదర్శనమన్నారు. ఇలాంటి సంఘటన జరుగుతున్నా ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్‌పి ప్రేరణకుమార్ ఏం చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. ఇక్కడకు అడిషనల్ ఎస్‌పి వచ్చారని ప్రజలు సంతోషించారన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోలేదన్నారు. పోలీస్‌శాఖ లాఅండ్‌ఆర్డర్ వదిలేసి వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రొద్దుటూరు ఎఎస్‌పి ఇంటికే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజలు ఆశించిన స్థాయిలో ఎఎస్‌పి ఒక్క శాతం కూడా చేయలేదన్నారు. ఎపి డిజిపి ఉద్యోగ విరమణ వరకు పోస్టింగ్‌లో ఉంటే చాలనుకుంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు జరుగుతుంటే డిజిపి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దుర్మార్గమైన పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. పోలీసులు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని వరదరాజులరెడ్డి పేర్కొన్నారు.

కడపకు నీటి తరలింపు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

మాట్లాడుతున్న జి.శివకుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుండి 1.5 టిఎంసి నీటిని కడప కొప్పర్తి పారిశ్రామిక వాడకు తరలించే ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిలా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపకు తాగునీటి అవసరాల కోసం దూరంలో ఉన్న బ్రహ్మసాగర్ నీటిని తరలింపు నిర్ణయం సరైందికాదన్నారు. ఇది కేవలం కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని కట్టబెట్టడం కోసమేనని విమర్శించారు. తాగునీటి కోసం బ్రహ్మసాగర్ నీటిని తీసుకోవటానికి సిపిఎం వ్యతిరేకం కాదని, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సోమశిల రిజర్వాయర్ బ్యాక్ వాటర్ కడప నగర పారిశ్రామిక అవసరాల కోసం వాడుకోవాలని నిర్ణయించారన్నారు. దానికి అనుగుణంగా కొంతమేర పైపులైన్ నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ పనులను కొనసాగించకుండా బ్రహ్మసాగర్ నుండి నీటిని తరలించే పక్రియ చేపట్టడం సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికే బ్రహ్మసాగర్ నుండి ఆర్‌టిపిపికి నీటిని తరలిస్తున్నారని, గోపవరం మండలంలో ప్లే వుడ్ పరిశ్రమ కోసం కూడా బ్రహ్మసాగర్ నీటిని తరలించే ఆలోచన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా రకరకాల అవసరాల పేరుతో ఉన్న నీటిని తరలించే నిర్ణయాలు సరికాదన్నారు. బ్రహ్మసాగర్ నీటిని నేరుగా వాడుకోలేని పరిస్థితి ఇక్కడి రైతులకు ఉందన్నారు. పిల్ల కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గోవింద్, నాయకులు, హరి, నరసింహ, అజయ్, రమణమ్మ, సుబ్బమ్మ, మేరీ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : బ్రహ్మసాగర్ నుంచి కడప పట్టణానికి నీటిని కేటాయించడం అన్యాయమని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప పట్టణానికి సోమశిల నుండి తాగునీటి కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. అయితే కొంతమంది అనాలోచితంగా, కరువు ప్రాంతమైన బద్వేలు, మైదుకూరు ప్రాంతాలకు ఉద్దేశించిన బ్రహ్మసాగర్ నుండి నీటి కేటాయింపులు అడగడం దుర్మార్గమన్నారు. సోమశిల ప్రాజెక్టుకు రాయలసీమ నుండే నీళ్లు పోతున్నాయని, కుందూ నది నుంచి ప్రతి సంవత్సరం 50 నుండి 100 టిఎంసి నీళ్లు వస్తున్నా, అక్కడి నుండి నీళ్లు కాకుండా కరువు ప్రాంతాలకు ఉద్దేశించిన నీళ్లను తీసుకుపోవడం అన్యాయమన్నారు. ఈ విషయంలో నెల్లూరు ప్రజాప్రతినిధుల హస్తం ఉందని విమర్శించారు. కడప జిల్లా నాయకులు లొంగిపోయారని ఆరోపించారు. కుందూ నది మీద రాజోలి జొలదరాసి, ఆదినిమ్మాయపల్లి వంటి రిజర్వాయర్ల అవసరం ఉందన్నారు. రాజోలి రిజర్వాయర్ నుండి బ్రహ్మసాగర్‌కు నీరు పంపింగ్ కోసం ఇప్పటికే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. రాజోలి రిజర్వాయర్ నిర్మితం కాకుండానే, బ్రహ్మసాగర్‌కు నీటిని ఎత్తిపోతలకు అనుమతులు ఇచ్చారన్నారు. ఇప్పటికే కెసి కెనాల్ రైతులు దీనిపై ఆందోళనలు చేస్తుంటే, ఇప్పుడు మళ్లీ బ్రహ్మసాగర్ నుండి కడప పట్టణానికి 1.5 టిఎంసి తరలించడం అన్యాయమన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని ఆయన సూచించారు. ఎన్నో దశాబ్దాలుగా రాజోలి రిజర్వాయర్‌ను ఆందోళన రూపంలో సాధించుకుంటే, అక్కడి నుండి పోయే నీటిని బ్రహ్మసాగర్‌కు తరలించడమే దుర్మార్గమని, కానీ అక్కడ ఉండి కడపకు తరలించడం ఇంకో దుర్మార్గమని ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం

విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, ఈ క్రమంలో పులివెందుల గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1955 నుంచి 2019 వరకు మొత్తం 16 సార్లు ఎన్నికలు (రెండు సార్లు ఉప ఎన్నికలు) నిర్వహించారని, ఇందులో కాంగ్రెస్ పార్టీ 12సార్లు విజయం సాధించిందన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి జరిగిందన్నారు. జెఎన్‌టియు కళాశాల, భూగర్భ డ్రయినేజీ, రింగ్ రోడ్డు, అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, శిల్పారామం, పులివెందుల-కడప ప్రధాన రహదారిలో నాలుగు లేన్ల రహదారి, పైడిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు, లింగాల కెనాల్, పిబిసి ఆధునికీకరణ, చిత్రావతి సామర్థ్యం పెంపు, గండికోట ఎత్తిపోతల, అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రం, ట్రిబుల్ ఐటీ, ఇందిరమ్మ ఇళ్లు ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనలోనే జరిగాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా వందశాతం రాయితీతో ఇరిగేషన్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి, పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు తిరుపాల్‌రెడ్డి, శ్రీకాంత్, మహేంద్ర, నరసింహారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

లోకేష్ హామీ హర్షణీయం

- టిడిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పి.సురేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో క్రిస్టియన్ల సంక్షేమం, అభివద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ హామీ ఇవ్వడం హర్షణీయమని టిడిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పి. సురేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా వివిధ జిల్లాల్లో క్రిస్టియన్లు ఇచ్చిన వినతుల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో యువగళం పాదయాత్రలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని క్రిస్టియన్ల తరువున కతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్లకు కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు స్మశానవాటికలకు స్థలాలు, చర్చిలకు స్థలాలు, ఫాస్టర్ లకు గహనిర్మాణం, ఫాస్టర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, ఫాస్టర్ లకు వివాహ రిజిస్ట్రేషన్ సులభతరం, క్రిస్టియన్ భవన్ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని లోకేష్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వ నాలుగు సంవత్సరాల పాలనలో క్రిస్టియన్లు తీవ్రంగా నష్టపోయారని, ఇంతవరకు ఎలాంటి లబ్ది చేకూరాలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే క్రిస్టియన్ల సంక్షేమం కోసం ఇచ్చిన ఏ ఒక్క హామీని జగన్ నెరవేర్చలేదని సురేష్ విమర్శించారు. క్రిస్టియన్ ల సంక్షేమం, అభివద్ధి తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యమని పేర్కొ న్నారు. రాష్ట్రంలోని క్రిస్టియన్లు టిడిపి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ జనార్దన్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియా ఉద్దీన్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

పులివెందుల పోలీస్ స్టేషన్లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోం గార్డు ఎస్.బాబా ఫక్రుద్దీన్ (హెచ్.జి 820) కుటుంబానికి రూ. 30లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని కుమార్తె పేరున, మరో రూ.8 లక్షల ఫిక్సెడ్ డిపాజిట్ ను (మొత్తం రూ. 38,00,000) చెక్కు రూపంలో ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ బాబా ఫక్రుద్దీన్ సతీమణి షేక్. షమీమ్‌కు గురువారం అందచేశారు. హోం గార్డు కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే హోం గార్డు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదనపు ఎస్.పి(అడ్మిన్) తుషార్ డూడి, ఎ.ఆర్ అదనపు ఎస్.పి ఎస్.ఎస్.ఎస్.వి కష్ణారావు, ఆర్.ఐ సోమశేఖర్ నాయక్, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏ.ఆర్ కానిస్టేబుల్ బి.రామకష్ణ (ఎఆర్‌పిసి 3085) కుటుంబానికి ఎస్.పి. కే.కే.ఎన్ అన్బురాజన్ రూ.2.75 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందచేశారు. ఇందులో పోలీసు వితరణ నిధి నుంచి రూ.2 లక్షలు, రూ.50 వేల విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేల మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందచేశారు. బి.రామకష్ణ సతీమణి బి.నాగలక్ష్మి కి ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ఆర్థిక సాయం అందచేశారు. కుటుంబ యోగక్షేమాలు విచారించారు. పిల్లల చదువులకు, కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) తుషార్ డూడి, డి.పి.ఓ ఏ.ఓ ఎన్.జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, జాయింట్ సెక్రటరీ రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమం, ఆరోగ్య భద్రత ముఖ్యం

- కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి ప్రకాష్, జిల్లా అదనపు ఆరోగ్య శాఖ అధికారి ఖాదరవల్లి

ప్రజాశక్తి - కడప

ఖైదీల సంక్షేమం ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యమని కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి ఐఎన్‌హెచ్.ప్రకాష్, జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి ఖాదరవల్లి అన్నారు. కడప కేంద్రకారాగారంలో గురువారం మూడవరోజు ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరేగా కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి ప్రకాష్ మాట్లాడుతూ జిల్లా అదనపు వైద్య శాఖ అధికారి కడప కేంద్ర కారాగారంలోని ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాదరవల్లి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కారాగారంలోని ఖైదీలకు హెపటైటిస్-బి, సి, సిఫిలిస్, టిబి, హెచ్ఐవి తదితర వ్యాధులకు రక్త నమూనాలను సేకరించి, పరీక్షించి తగిన జాగ్రత్తలు తెలియజేయడం జరిగిందన్నారు. కారాగార వైద్యాధికారి డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి సమస్యలు ఏమైనా ఉంటే తగిన చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్, కేంద్ర కారాగారం ఉప పర్యవేక్షణ అధికారి జవహర్ బాబు, ఎండి రఫీ, కే గోవిందరావు, చంద్రయ్య, జాకీర్ కన్నా, ప్రసన్న, నాగేశ్వరయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు. కారాగారంలోని 496 మంది ఖైదీలలో 416 మంది శిక్ష ఖైదీలు, 80 మంది రిమాండ్ ముద్దాయిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

ప్రజాశక్తి - చాపాడు

సమస్యల పరిష్కారానికి నిరంతరంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లెలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి గడపకు నేరుగా వెళ్లగలుగుతున్నామన్నారు. పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ప్రతిరోజు సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, తహశీల్దార్ సుభాని, మండలస్థాయి అధికారులు, నాయకులు హజరత్‌రెడ్డి, వీరారెడ్డి, రామచంద్రారెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, బాల నరసింహారెడ్డి, రామాంజనేయరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పనులను పరిశీలిస్తున్న బంగారురెడ్డి

పది కాలాలపాటు ప్రజలకు సౌకర్యాలు అందించాల్సిన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలం పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి తెలిపారు. రూ.120కోట్లతో ప్రజలకు అమృత్ పథకం కింద నీరందించే పనుల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల సమీపంలో పైప్‌లైన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బంగారురెడ్డి మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇ దస్తగిరిరెడ్డి, వైసిపి నాయకులు పోసా భాస్కర్, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

ఆర్‌డిఒ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ విజయ్‌రామరాజు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆయనను కలిసి ప్రెస్‌క్లబ్‌కు భవనాన్ని కేటాయించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆర్‌డిఒ సభా భవనంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

- పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిటెక్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్‌కు పది మంది యువకులతో కమిటీ వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు రాబోయే రోజుల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాల్గొన్నాలని ఆయన సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, పూల అల్లాబకష్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, జబిబుల్లా, వీరభద్ర, తెలంగాణ వలి, మల్లికార్జున, అలిరెడ్డిపల్లె బాలకృష్ణారెడ్డి, మడక వేమా, రామగంగిరెడ్డి, శ్రీనువాసులు పాల్గొన్నారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వైఎస్ఆర్ పశుబీమాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ కోరారు. మండలంలోని పలుగురాళ్లపల్లి పంచాయతీలో వైఎస్ఆర్ పశుబీమా పథకంపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. పూర్తి సమాచారం కోసం రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కడప డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ వెంకట రమణయ్య, బి. మఠం సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఇన్సూరెన్స్ మీడియేటర్ కార్తికేయరెడ్డి, పలుగురాళ్లపల్లి సర్పంచు మార్తమ్మ భర్త జయన్న, పెద్దిరాజుపల్లి, పలుగురాళ్లపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ నిత్యానంద్, బి.కోడూరు, ప్రభలవీడు వైద్యులు భరద్వాజ్, లక్ష్మినరసయ్య, సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు పంపిణీ చేస్తాం

వేంపల్లె : రైతులకు స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు పంపిణీ చేస్తామని, అవసరమైన వారు ఆర్‌బికెల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఎపిఎంఐపి పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో గురువారం వ్యవసాయ శాఖ, రైతు భరోసా, ఉద్యానశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి రైతుతో ఇకెవైసి చేయించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎడిఎ అశోక్‌కుమార్, ఎఒ రాజేంద్రప్రసాద్, ఉద్యానశాఖ అధికారి రెడయ్య, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరులో అత్యధిక వర్షపాతం

కడప: మైదుకూరులో అత్యధికంగా 64.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి గురువారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కడపలో 1.2, కమలాపురంలో 3.6, వల్లూరులో 3.6, చెన్నూరులో 2.2, చింతకొమ్మదిన్నెలో 1.4, కాజీపేటలో 21.8, ఒంటిమిట్టలో 2.4, సిద్ధవటంలో 1.6, బద్వేలులో 1.2, బి.మఠంలో 5.0, కాశినాయనలో 14.4, కలసపాడులో 15.6, పోరుమామిళ్లలో 18.2, బి.కోడూరులో 11.8, గోపవరంలో 0.8, అట్లూరులో 18.2, జమ్మలమడుగులో 45.2, కొండాపురంలో 6.2, మైలవరంలో 46.4, పెద్దముడియంలో 56.0, రాజుపాలెంలో 35.4, ప్రొద్దుటూరులో 9.0, ముద్దనూరులో 16.2, చాపాడులో 25.6, దువ్వూరులో 34.2, ఎర్రగుంట్లలో 4.8, పులివెందులలో 35.0, సింహాద్రిపురంలో 1.4, లింగాలలో 1.2, వేములలో 3.0, వీరపునాయునిపల్లిలో 1.4, చక్రాయపేటలో 10.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా సగటున 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.